క్లుప్తంగా

నేడు పేరెంట్స్ కమిటీ సమావేశం

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేడు(శనివారం) పేరెంట్స్ కమిటీ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చడానికి పేరెంట్స్‌తో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

వేడుకలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పుల్ల మల్లయ్య

ఘణపురం: హనుమకొండలో ఈనెల 21న నిర్వహించే అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మాంకాల యాదగిరి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయం కోసం పని చేసిన వారికి ఉత్తమ సేవలు అందించిన సభ్యులకు సన్మానం, ప్రతిభ పురస్కారాలు ఉంటాయని తెలిపారు. నాయకులు రాజయ్య, సంపత్, శంకర్ గౌడ్, దూడపాక శ్రీవాస్ కండే రవి పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను పాఠశాల హిందీ భాషా ఉపాధ్యాయులు షాహెద బేగం, అజ్మత్ పాషాల ఆధ్వర్యంలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ కవితలు, హిందీ దోహేలు, హిందీ గీత్‌లు, చిత్ర లేఖన్, భాషన్, నిబంధ్, నృత్యాలు పలు అంశాలలో బాలబాలికలు పాల్గొని అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ ప్రకాశ్‌బాబు పాల్గొని మాట్లాడారు. హిందీ నేర్చుకోవడం వలన దేశంలో ఏ ప్రాంతానికైనా వెళ్లి ఉద్యోగం చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, మడక మధు, సుధారాణి, వలిపాషా, వీరేశం, సమ్మయ్య, శ్రీనివాస్, లీలా, రజిత, దీపిక, ఆంజనేయులు పాల్గొన్నారు.

సన్మానం



ఎల్లంకి సుమతిని సన్మానిస్తున్న మండల సమైఖ్య వీఓఏలు

టేకుమట్ల: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో కొనసాగుతున్న ఆదర్శ గ్రామైఖ్య సంఘం వీఓఏగా విధులు నిర్వర్తిస్తున్న మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన ఎల్లంకి సుమతి పొదుపు సంఘాలకు అందించిన సేవలకు గానూ శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమైఖ్య కార్యాలయంలో కార్యాలయ అధికారులు శాలువా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీఎం మంజుల మాట్లాడుతూ.. బ్యాంక్ లింకేజీ లోన్లను మహిళా పొదుపు సంఘ సభ్యులకు అందించి వారిని ఆర్థిక అక్షరాస్యతవైపు అడుగులు వేసేందుకు కృషిచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ ఉమాదేవి, ఆపరేటర్ స్వాతి, ఎంఎస్ అధ్యక్షురాలు గువ్వాడి రజిత, వీఓఏలు భూపెల్లి విజయ, స్వాతి, తీగల స్వరూప, మాదుగుల శైలజ, ఆకినపల్లి భాగ్యశ్రీ, రమేశ్, సమ్మయ్య, శంకర్, కిరణ్, మానస, శ్రీలత, సంధ్య, సరోజన, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనిధి మేనేజర్ దాసారపు సుమన్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల కృష్ణగౌడ్ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ పరామర్శించి కృష్ణగౌడ్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల నాయకుల బైరం భద్రయ్య, చిలుముల రమణాచారి, పెరుమాండ్ల రవీందర్, తొటం నవీన్, నాగరాజు, రాజేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

వీధి దీపాలు వెలిగేనా?

- జీపీల్లో నిధుల లేమితో సతమతం
- నిర్వహణకు దాదాపు రూ.9 లక్షల ఖర్చు!



పోల్స్‌పై లైట్లు బిగిస్తున్న సిబ్బంది (ఫైల్)



నిధులు సమకూర్చాలని ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు (ఫైల్)

మల్హర్: నిధుల లేమి కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిలో కుంటుపడుతున్నాయి. గ్రామాల్లో పండుగలు సైతం చీకట్లో చేసుకునే నిర్వహించుకునే పరిస్థితి నెలకొంది. అతి పెద్ద పండుగలైన బతుకమ్మ, దసర వేడుకలు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు చేయడంలో కష్టమే అనిపిస్తుంది.

3101 వీధి దీపాల ఏర్పాటు..

మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 3101 వీధి దీపాలను కరెంట్ పోల్స్‌పై జీపీ అధికారులు ఏర్పాటు చేయాలి. తాడిచర్లలో 576, మల్లారంలో 396, చిన్నతూండ్లలో 80, కొండంపేట 110, ఇప్పలపల్లి 95, అన్సాన్‌పల్లి 160, పెద్దతూండ్ల 398, అడ్వాలపల్లి 120, దుబ్బపేట 50, కొయ్యూరు 210, వల్లెకుంట 226, మల్లెంపల్లి 45, రుద్రారం 295, ఎడ్లపల్లి 160 దీపాలను బిగించాల్సి ఉంది.

నిర్వహణకు రూ.9 లక్షలు ఖర్చు

మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల్లో 3101 ఎల్ఈడీ లైట్ బిగించడానికి గ్రామ పంచాయతీలు రూ.9లక్షల మేర ఖర్చు చేయాల్సి ఉంది. గ్రామ పంచాయతీలు నిధుల లేమితో సతమతమవుతున్నాయి. దీంతో కార్యదర్శులు గ్రామంలో లైట్లు బిగించడానికి ముందుకు రావడం లేదు. ఒక్క ఎల్ఈడీ కొనుగోలు చేయాలంటే రూ.250 మేరకు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ లెక్క చిన్న గ్రామ పంచాయతీలకు రూ.30 వేల నుంచి రూ.50, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ.70 వేల నుంచి రూ.1.50 లక్షల మేర ఖర్చుకానున్నట్లు తెలుస్తోంది. నిధులు లేక పంచాయతీల్లో ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టని పరిస్థితి.

నిధులు సమకూర్చాలని వినతి

బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో గ్రామాల్లో వీధి దీపాలు లైట్లు బిగించడానికి నిధులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు ఈనెల 16న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీరామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నామని వినతిలో పేర్కొన్నారు. తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన..



గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా పండగలకు గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు బిగించడానికి కార్యదర్శులు ముందుకు రావడం లేదు. నిధుల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పండుగల సమయానికి గ్రామాల్లో లైట్లు బింగించేలా చర్యలు తీసుకుంటాం.

\- శ్రీరామ్మూర్తి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

ముందస్తు బతుకమ్మ సంబురాలు



ఆదర్శ పాఠశాలలో రామాయణ ఇతిహాసం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌తో పాటు గిరిజన గురుకుల బాలికల పాఠశాల, విద్యానికేతన్ హై స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో ఆకట్టుకునే బతుకమ్మలు తయారు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఉపాధ్యాయులు బతుకమ్మ పండగ విశిష్టత, ప్రాముఖ్యతను గూర్చి విద్యార్థులకు వివరించారు. ఆయా పాఠశాలలో ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఆదర్శ హై స్కూల్‌లో ఆదికావ్యమైన రామాయణ ఇతిహాసంలోని విశేష దృశ్యాలను ప్రదర్శించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, టీటీడబ్ల్యూఆర్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, కేజీబీవీ ఎస్ఓ చల్ల సునీత, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, విద్యానికేతన్ కరస్పాండెంట్ బుర్ర వెంకటేశ్‌గౌడ్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు కృషిత, సుజారాణి, టీటీడబ్ల్యూఆర్ వైస్ ప్రిన్సిపాల్ సరిత పాల్గొన్నారు.

నియామకం

కాటారం: బీజేపీ మండల మోర్చా పలు విభాగాల అధ్యక్షులను శుక్రవారం నియమించినట్లు మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ తెలిపారు. మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా పులిసే కవిత, యువ మోర్చా మండల అధ్యక్షుడిగా అజ్మీరా నవీన్ నాయక్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా ముత్యాల రాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా తోట దేవేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా మంద సారయ్య, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా బొచ్చు రమేశ్‌ను నియమించినట్లు పూర్ణచందర్ తెలిపారు. నూతన అధ్యక్షులకు పలువురు అభినందనలు తెలిపారు.

యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు

- కాటారం డీఎస్పీ సూర్యనారాయణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

కాటారం: యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ సూర్యనారాయణ అన్నారు. ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు కాటారం మండలం కొత్తపల్లిలో డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. సరైన పత్రాలు, నంబర్‌ప్లేట్ లేని 12 బైక్‌లు స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరు వ్యక్తుల వద్ద 40 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లంపానకం గుర్తించి ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. అనంతరం డీఎస్పీ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి రవాణా చేసినా విక్రయించినా, సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి, గుడుంబా నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని.. వాటికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలని కోరారు. భూ సంబంధిత గొడవలను ఆసరా చేసుకొని అమాయకులను మోసంచేసే వారిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, యువత ముందుకు రావాలని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, సీఐతో పాటు ఎస్సైలు శ్రీనివాస్, మహేందర్, ఓంపాల్, మహేశ్, మానస, సివిల్, టీజీఎస్పీ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలతో ఐక్యత



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: శాంతి, మతసామరస్యానికి నిలయంగా ప్రవక్త బోధనలు మనల్ని ఐక్యతవైపు నడిపిస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణం రాజీవ్‌నగర్‌లోని జామా మసీదు నుంచి స్థానిక అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ముస్లింల ర్యాలీలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ బోధనలు శాంతి, సహనం, మానవతా విలువలకు ప్రతీక అని అన్నారు. ఆయన సందేశాలు మతసామరస్యానికి మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిప్పాల రాజేందర్, అంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్లు తప్పనిసరి

గీతా కార్మికులకు తాటి చెట్టు ఎక్కే సమయంలో ప్రమాదాలు జరుగకుండా ఉండటానికి కాటమయ్య రక్షణ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలం ఎస్ఎం కొత్తపల్లి (ఎస్ఎం) గ్రామ శివారు సోలిపేట తాటి వనంలో జిల్లా బీసీ సంక్షేమ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కల్లుగీత కార్మికులకు పూర్తి స్థాయిలో కాటమయ్య రక్షణ కిట్లను అందించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గీతా కార్మిక సంఘం నాయకులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలన



యూరియా పంపిణీ పరిశీలిస్తున్న ఏఓ పూర్ణిమ, ఏఈఓలు

కాటారం: యూరియా సక్రమంగా పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ పూర్ణిమ తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్, దేవరాంపల్లి డీసీఎం వద్ద శుక్రవారం కొనసాగిన యూరియా పంపిణీని ఏఓ పరిశీలించారు. యూరియా పంపిణీ వద్ద ఏఈఓలు ఉండి రైతులకు ఒక్కో యూరియా బస్తాకు ముందుగా కూపన్లు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా యూరియా పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. దేవరాంపల్లిలో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా రైతులు నానో యూరియా వినియోగించుకోవాలని సూచించారు. నానో యూరియాతో పంట దిగుబడి పెరగడంతో పాటు పర్యావరణంలో కాలుష్య నివారణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఫెర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజన్న, అస్మా, యోగిత, దీపక్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పక్కన చదును చేస్తున్న ప్రొక్లెయినర్

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల: మండల కేంద్రం నుంచి టేకుమట్లకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా ఉండడంతో గత నెల 31న 'కల్వర్టుతో కష్టాలు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించడం జరిగింది. దీంతో స్పందించిన అధికారులు శుక్రవారం కాంట్రాక్టర్‌తో పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అధికారుల వత్తాసు



మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: ఇసుక అక్రమ రవాణాకు అధికారులు వత్తాసు పలుకుతూ స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుకను అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముందుకు వెళ్తున్నారని, దాన్ని అబాసు పాలు చేస్తే మండల ప్రజలు ఊరుకోరని అన్నారు. దళారులు ఇసుకను నిత్యం మండల కేంద్రంలోని చలివాగు నుంచి వందల సంఖ్యలో తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేకు గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ చెడ్డపేరు తీసుకుచ్చేలా ప్రయత్నిస్తే మండల కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు దొంతుల శ్రీనివాస్, వైనాల రవీందర్, బండ శ్రీకాంత్ పాణి, నాంపెల్లి వీరేశం, పొన్నం సాంబయ్య, క్రాంతి, కొలుగూరి అనిల్, రాజు, రమేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



వేశాలపల్లిలో అవగాహన కల్పిస్తున్న తిరుపతి

భూపాలపల్లి రూరల్: బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సహాయ ఎన్జీఓ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ శాస్త్రాల తిరుపతి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని బాంబుల గడ్డ, వేశాలపల్లి గ్రామంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బలమైన భారత నిర్మాణమే లక్ష్యంగా అడుగులేయాలంటే ప్రతీ గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళా సంఘాల కార్యదర్శి ఈర్ల స్వప్న, కిన్నెర పల్లవి, సామల శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



పిచికారీ చేయిస్తున్న అధికారులు

మల్హర్: మండలంలోని నాచారంలో జిల్లా ఏపెడమిక్ టీం సభ్యులు శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల మందు నివారణ మందును పిచికారీ చేయించారు. వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపెడమిక్ టీం రమేశ్‌కుమార్, తలకోటి పరమేశ్వర్, సతీష్, కాపర్తి రాజు, ఊరుకొండ గోపి, హెల్త్ అసిస్టెంట్ హేమ్ సింగ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయగూడెం సందర్శన



గొత్తికోయలతో అధ్యాపకులు, విద్యార్థులు

ములుగు రూరల్: ములుగు మండలంలోని జగ్గన్నగూడెం పంచాయతీ పరిధి బోడరామయ్యగడ్డలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గొత్తికోయగూడాన్ని సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి వారు సందర్శించారు. గూడెంలో 22 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించినట్లు ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఆర్థిక, సామాజిక వెనకబాటుతనాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధ్యాపకులు బాలయ్య, న్యాక్ కోఆర్డినేటర్ కవిత, భాస్కర్, సరిత, శిరీషా, అనిల్, శంకర్, ఉదయశ్రీ పాల్గొన్నారు.

జోనల్ క్రీడలు విజయవంతం



క్రీడాకారులతో అధికారులు, ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: జోనల్ స్థాయి క్రీడోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ మొగుళ్లపల్లి జోన్ చైర్మన్, మండల విద్యాధికారి లింగాల కుమారస్వామి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల మూడు మండలాల క్రీడాకారులకు జోనల్ స్థాయిలో ఎంపిక నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ లింగాల కుమారస్వామి మాట్లాడుతూ.. ఎంపికకు మూడు మండలాలనుంచి 450 మంది విద్యార్థులు అండర్ 14 అండర్ 17 విభాగాలలో బాల బాలికలు క్రీడోత్సవాలకు హాజరైనట్లు తెలిపారు. జోనల్ స్థాయిలో ఎంపికైనా విద్యార్థులరు జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పింగిలి విజయపాల్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండెల్లి రాజయ్య, ఫిజికల్ డైరెక్టర్లు సూదం సాంబమూర్తి, బొమ్మ సందీప్ రెడ్డి, సంగినేని పృథ్వీరాజ్ బండి ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి వెటర్నరీ మాస్టర్ సైన్స్ డిగ్రీ పట్టా



గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న రాజబాబుగౌడ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్న బుర్ర రాజబాబుగౌడ్ వెటర్నరీ గైనకాలజీ అండ్ ఆబ్స్టెట్రిక్స్‌లో (ఎంవీఎస్‌సీ) మాస్టర్ వెటర్నరీ సైన్స్ డిగ్రీ పట్టాను పొందాడు. శుక్రవారం హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్శిటీ (పీవీఎన్ఆర్‌టీవియు) 5వ స్నాతకోత్సవ సభలో ఆయనకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పట్టాను ప్రదానం చేశారు. ఈ సన్మాన సభలో పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్, విద్యావేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు

ములుగు రూరల్: మండల పరిధిలోని జాకారం, అబ్బాపూర్, శ్రీరాములపల్లి, భూపాల్‌నగర్, కోయగూడెం మద్దునూరుతండా మాన్‌సింగ్‌తండా, పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఎస్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సతీశ్‌కుమార్, మధు సుధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలను విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ హమీద్, డేగల రమేష్, అగయ్య, సౌజన్య, భిక్షపతి, మహేష్ సునీతతో పాటు తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291